

చిట్టి బుర్రల్లో సిత్రాలెన్నో

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్‌మనాక్ పోటీలు నిర్వహిస్తుంది. ఇందుకు పాఠశాలల విద్యార్థుల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తోంది.

8లో▸



జ్వాలా వీరభద్రుడికి పూజలు

శ్రీశైలం : ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి బుధవారం శాస్త్రోక్తంగా అభిషేక అర్చనలు నిర్వహించారు. లోక శాంతి కోసం ఈ పూజలు చేసినట్లు ఈఓ పెద్దిరాజు తెలిపారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,632.50
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:103.780
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:87,394
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:50,302

న్యూస్‌రీల్

రూ.10 నాణేలపై నిషేధం లేదు

కర్నూలు(అగ్రికల్చర్): పది రూపాయల నాణేలను చెల్లుబాటులోకి తెచ్చేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాతో పాటు బ్యాంకులు చొరవ తీసుకుంటున్నాయి. పది రూపాయల నాణేలపై ఎలాంటి నిషేధం లేకపోయినప్పటికీ దాదాపు ఎనిమిదేళ్లుగా చెలామణిలో లేవు. వ్యాపారులు, ఇతర వినియోగదారులు రూ.10 నాణేన్ని అస్సలు తీసుకోవడమే లేదు. ఎక్కడైనా ఒకటి, రెండు నాణేలు ఉంటే వాటిని బ్యాంకులకు తెచ్చి అకౌంటులో వేసుకుంటున్నారు. ఫలితంగా బ్యాంకుల్లో నాణేలు పేరుకుపోయి స్థల సమస్య కూడా ఉత్పన్నమవుతోంది. ఈ నేపథ్యంలో రూ.10 నాణేన్ని వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్(ఎల్‌డీఎం) నరసింహారావు తెలిపారు. త్వరలోనే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యాపార, వాణిజ్య సంఘాల ప్రతినిధులు, వినియోగదారుల సంఘాలకు నాణేల చెల్లుబాటుపై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు.

రేపు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కర్నూలు(అర్బన్): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9న ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి జె.రంగలక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థులకు సన్మానిస్తామన్నారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

తల్లి పాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ పి.వెంకటలక్షుమ్మ

కర్నూలు(అర్బన్): పుట్టిన బిడ్డకు తల్లిపాలే సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వెంకటలక్షుమ్మ, ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు ఎస్.రోకియాబేగం అన్నారు. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక బి.క్యాంప్‌లోని కర్నూలు అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో ఆరు నెలల శిశువులకు అన్న ప్రాసన, గర్భిణులకు సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో ప్రధాన భూమిక పోషిస్తున్న మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ముఖ్యంగా తమ చిన్నారుల ఆరోగ్యం, చదువు పట్ల ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ జి.అనురాధ, ఏసీడీపీఓ బాలామణి, డీసీపీఓ శారద, సూపర్‌వైజర్లు జమీలా, వినోలియా, చోటీమా, నజ్మా, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డులోనే ఏరువాక కేంద్రం

- ఉత్తర్వులు జారీ చేసిన ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్

కర్నూలు(అగ్రికల్చర్): ఏరువాక కేంద్రం(డాట్ సెంటరు) కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోనే ఏర్పాటు కానుంది. ఈ నెల 14వ తేదీలోపు ఏర్పాటు చేసేందుకు ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రామచంద్రరావు ఉత్తర్వులు జారీ చేశారు. 1998 నుంచి రైతులకు సేవలు అందిస్తున్న ఏరువాక కేంద్రాన్ని 2014–15 నుంచి 2018–19 రాష్ట్రాన్ని పాలించిన టీడీపీ ప్రభుత్వం నిర్వహణ ఖర్చులు భరించలేమని పేర్కొంటూ... బనవాసి కృషి విజ్ఞాన కేంద్రానికి తరలించింది. 2019 మే నెలలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకొచ్చింది. అయితే జిల్లాల పునర్విభజన సమయంలో ఏరువాక కేంద్రం నంద్యాలకు తరలించారు. ఆ జిల్లాలో ఆర్‌ఏఆర్‌ఎస్ , వ్యవసాయ కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, ఎన్‌జీఓ కృషి విజ్ఞాన కేంద్రం తదితరవి ఉన్నాయి. దీంతో నంద్యాల జిల్లాలో విస్తరణ కార్యక్రమాలకు ఢోకా లేదనే ఉద్దేశంతో ఏరువాక కేంద్రాన్ని తిరిగి కర్నూలుకు తరలిస్తున్నట్లు రిజిస్ట్రార్ రామచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బొమ్మిరెడ్డిపల్లెలో టీడీపీ వారికి భయపడి ఊరు విడిచి పెట్టిపోవడంతో బీడుగా మారిన భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డిల పొలాలు



బతుకులు బీడు

గ్రామాల్లో టీడీపీ రాక్షసత్వం

- రాజకీయ కక్షతో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు
- ఊళ్లు వదిలిన వందలాది కుటుంబాలు
- బిక్కుబిక్కుమంటూ బంధువుల ఇళ్లలో జీవనం
- నిలిచిపోయిన పిల్లల చదువులు
- పొలాలు బీడు పడటంతో కన్నీటి పర్యంతం
- బాధితులకు భరోసా కల్పించని పోలీసులు



బొమ్మిరెడ్డిపల్లెలో తాళాలు వేసి వెళ్లిపోయిన బాధితులు రాజేష్ చౌదరి, రంగయ్య నివాసాలు

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఉపాధి కోసమో, కరువొస్తేనో గ్రామాల్లో ప్రజలు వలస వెళ్లడం చూస్తుంటాం. కానీ, టీడీపీ అధికారంలోకి వచ్చాక సాగిస్తున్న దౌర్జన్యాలు, దాడులు తట్టుకోలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సొంత ఊరు వదిలి పక్క ఊరికి వెళ్లడం మాత్రం ఇప్పుడే చూస్తున్నాం. ఊళ్లోకి వెళితే ఎక్కడ చంపేస్తారో అని పిల్లా పాపలతో దూరపు ఊళ్లలోని బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్న వారు కొందరైతే, బతికితే చాలనుకుంటూ సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిపోయిన వారు మరికొందరు. ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీకి ఓటేశారనో, ఆ పార్టీకి సానుభూతి పరులుగా ఉన్నారనో కక్షగట్టిన టీడీపీ నేతలు గ్రామాల్లో దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఏకంగా చంపేస్తామని బెదిరిస్తున్నా పోలీసులు నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల చదువులు ఆగిపోయి.. పొలాలు బీళ్లుగా మారి బాధితుల జీవితం కన్నీటి సుడిగుండాన్ని తలపిస్తోంది.

ఊళ్లు వదిలి తలదాచుకున్న కుటుంబాలు

టీడీపీ నేతల దాడులకు భయపడి క్రిష్ణగిరి, వెల్దుర్తి, మహానంది, కొలిమిగుండ్లతో పాటు పలు చోట్ల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు ఊళ్లు వదిలారు. పత్తికొండ నియోజకవర్గం బొమ్మిరెడ్డిపల్లె, రామళ్లకోట, తొగర్చేడు, రామకృష్ణాపురం , చుంచు ఎర్రగుడిలో చాలా కుటుంబాలు ఊరు వదిలాయి. ఆ గ్రామాల్లోకి వెళితే తాళాలు వేసిన ఇళ్లే కన్పిస్తున్నాయి. బొమ్మిరెడ్డిపల్లెలో కౌంటింగ్ ముగిసిన తర్వాత రోజు నుంచి టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. చివరకు దాడులకు దిగారు. ఈ దాడిలో టీడీపీకి చెందిన గిరినాథ్‌చౌదరి చనిపోయారు. ఈ ఘటనకు సంబంధించి 11 మందిపై పోలీసులు కేసు కట్టి రిమాండ్‌కు పంపారు. అయితే ఆ గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల కుటుంబాలు ఎవ్వరూ ఊళ్లో ఉండకూడదని టీడీపీ నేతలు హుకుం జారీ చేశారు. పోలీసులు కూడా ఏం చేయలేక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఊరు దాటించేశారు. ఐదేళ్లపాటు వైఎస్సార్‌సీపీ కుటుంబాలు ఊళ్లోకి వస్తే పెట్రోలు పోసి కాల్చేస్తామని టీడీపీ నేతలు పెట్రోలు బాటిళ్లతో ఇళ్లిళ్లా తిరిగి బెదిరించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చివరకు ఆ గ్రామ సర్పంచ్ కూడా ఊళ్లో ఉండలేక కర్నూలులో ఉంటున్నారు. ఇప్పుడు ఈ ఊళ్లోకి ఇతరులు ఎవరు వెళ్లినా టీడీపీ నేతలు ఎవరు మీరు? ఎందుకు వచ్చారు? అని ప్రశ్నిస్తున్నారు. పూర్తిగా గ్రామాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు.

పొలాలన్నీ బీళ్లే..

వైఎస్సార్‌సీపీ కుటుంబాలు ఊళ్లు దాటడంతో వారికి చెందిన పొలాలన్నీ బీళ్లుగా ఉన్నాయి. వర్షాలు కురిసి చుట్టుపక్కల పొలాల్లో కంది, పత్తితో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నారు. టీడీపీ నేతల పొలాలు కూడా పచ్చగా ఉన్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల కుటుంబాల భూములు మాత్రం బీళ్లుగా ఉన్నాయి. కేవలం బొమ్మిరెడ్డిపల్లెలోనే 300 ఎకరాలకుపైగా భూములు బీడుగా ఉన్నట్లు తెలుస్తోంది. తక్కిన ప్రాంతాల్లో కలిపి కనీసం 500 ఎకరాలకుపైగా భూములు బీడుగా ఉండిపోయాయి.

భర్తను హత్య చేసినా కన్నీళ్లు దిగమింగి!

గతంలో టీడీపీ హయాంలో 2017లో చెరుకులపాడు నారాయణరెడ్డిని అత్యంత కిరాతకంగా హతమార్చారు. 2019లో నారాయణరెడ్డి సతీమణి శ్రీదేవి పత్తికొండ ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 నుంచి 2024 వరకూ ఆమె కానీ, వైఎస్సార్‌సీపీ నేతలు కానీ అప్పటి ప్రతిపక్షంపై ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదు. పైగా కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరేందుకు తనవంతు ప్రయత్నం చేశారు. కానీ తాజా ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు నుంచే ఈ ప్రాంతంలో టీడీపీ శ్రేణులు దౌర్జన్యకాండకు పాల్పడుతున్నారు. ఈ ఒక్క ప్రాంతంలోనే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయ రాక్షసత్వం కనిపిస్తోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని ముఖ్య ఘటనలు

- ➤ కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ బత్తుల మల్లేశ్ భార్య, పిల్లలను తీసుకుని అనంతపురం వెళ్లి అక్కడే తలదాచుకుని పిల్లల్ని చదివించుకుంటున్నారు.
- ➤ బండిఆత్మకూరు మండలం లింగాపురంలో గోవిందరెడ్డి అనే కుటుంబం టీడీపీ నేతల దాడులకు భయపడి ఊరు వదిలారు.
- ➤ క్రిష్ణగిరి మండలం రామకృష్ణాపురంలో జయన్నతో పాటు మరో మూడు కుటుంబాలు ఊరు వదిలాయి.
- ➤ వెల్దుర్తి మండలం రామళ్లకోటలో అబ్దుల్ మజీద్ కుటుంబం బేతంచర్లకు వెళ్లిపోయాడు. అదే గ్రామంలో నజీర్ కుటుంబం డోన్‌కు వెళ్లిపోయింది. ఈ గ్రామంలో 7 కుటుంబాలు ఊరు వదిలాయి.

పోలీసుల నిస్సహాయత

ఖాళీ చేసిన కుటుంబాల్లో చాలామంది తమ పిల్లలను స్కూళ్లలో టీసీలు తీసుకుని తలదాచుకున్న ప్రాంతాల్లో చదివిస్తున్నారు. కనీసం గ్రామాలకు వచ్చి పిల్లల ఆధార్‌కార్డులు, పుస్తకాలు, బట్టలు తీసుకునేందుకు కూడా ధైర్యం చేయలేకపోతున్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేసింది, చేస్తోంది టీడీపీ నేతలు, కార్యకర్తలే. అయినప్పటికీ శాంతిభద్రతల పేరిట బాధితులను ఊళ్లు వదిలిపొమ్మని పోలీసులే చెబుతూ అరాచక పాలనకు తోడుగా నిలుస్తున్నారు. ఈ పరిస్థితిని చూస్తే పోలీసుల నిస్సహాయత ఇట్టే అర్థమవుతుంది.

పిల్లలను చదివించుకోలేక..



ఈ ఫోటోలో ఉన్న మహిళ పేరు లలిత. వీరిది పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండలంలోని బొమ్మిరెడ్డి పల్లె. ఈ గ్రామంలో గత నెల 9న హత్య జరిగింది. హత్యకు, వీరికి సంబంధం లేదు. అయితే పోలీసులు వీరిని ఊరు వదిలి వెళ్లాలని చెప్పారు. చేసేది లేక భర్త రాజేశ్ చౌదరి, ఇద్దరు పిల్లలు సూర్యతేజ(6వ తరగతి), ప్రణతి(3తరగతి)లను తీసుకుని కట్టుబట్టలతో ఊరు దాటారు. పిల్లల్ని స్కూలులో చేర్చేందుకు సర్టిఫికెట్లు, పుస్తకాల కోసమని ఇటీవల లలిత ప్రాణాలకు తెగించి ఊరికి వెళ్లింది. ఈలోపు టీడీపీ దండు ఇంటిమీద పడింది. అక్కడ పికెట్‌లోని పోలీసులు అప్రమత్తమై ఆమెను తిరిగి బస్సెక్కించారు తప్ప భద్రత కల్పించలేకపోయారు. చివరకు వీరికున్న 30 ఎకరాల పొలం కూడా బీడు పడటం గమనార్హం. ఇప్పుడు ఈ కుటుంబం కర్నూలులో కొద్దిరోజులు, తాడిపత్రి, గుంతకల్లులోని బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు.

ఊళ్లోకి వస్తే చంపేస్తామంటున్నారు



నా పేరు సునీత. సర్పంచ్‌ను. మా ఊళ్లో గిరినాథ్ చౌదరి హత్య జరిగింది. హత్య చేసిన వారు జైల్లో ఉన్నారు. అయితే మమ్మల్ని ఊళ్లో ఉండకూడదు.. ఉంటే చంపేస్తామని సుబ్బరాయుడు, రామంజనేయులుతో పాటు టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు. హత్య జరిగిన రోజున పోలీసులు మమ్మల్ని ఊరు వదిలి వెళ్లాలని చెప్పారు. రెన్నెళ్లయింది. కర్నూలులో ఉంటున్నా. 30 కుటుంబాలకుపైగా ఊరు దాటారు. మాకున్న 75 ఎకరాల పొలం బీడు పెట్టుకున్నాం. దుక్కిదున్ని విత్తనాలు, ఎరువులు తెచ్చుకున్నా ఫలితం లేకపోయింది.

అత్తగారింట్లో తలదాచుకుని..



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు కురవ సురేశ్. క్రిష్ణగిరి మండలం రామకృష్ణాపురం. గత నెల 7వ తేది రాత్రి 8గంటలకు కర్నూలు నుంచి బైక్‌లో ఊరికి వెళ్లాడు. సర్పంచ్, టీడీపీ నేత దామోదర్ ఇళ్లు దాటుకుని ఇంటికి వెళ్లాలి. సర్పంచ్ ఇంటి వద్దకు వెళ్లగానే 40మంది గుంపు కట్టెలు, రాడ్లు తీసుకుని బైక్‌ను వెంబడించారు. బైక్ పడేసి పరిగెత్తాడు. చీకటిలో తప్పించుకున్నాడు. బైక్‌ను పగలగొట్టి నిప్పంటించారు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి సురేశ్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లాడు. ఊళ్లోకి వస్తే చంపేస్తామని బెదిరించారు. ఇతను వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఆ ఊళ్లో గట్టిగా నిలబడటం మినహా మరో నేరం చేయలేదు. దీంతో భార్య సుజాతతో కలిసి ఊరు వదిలాడు. చివరకు తన 7ఎకరాల పొలం బీడుగా ఉంటే, తన తమ్ముడు రాముడు సాగు చేస్తున్నారు. సుజాత తన అమ్మగారింట్లో భర్తను ఉంచుకుని కంటిమీద కునుకు లేకుండా జీవిస్తోంది.

ఊళ్లో కాలు పెట్టనివ్వట్లేదు



నా పేరు షేక్ మాలిక్, మాది రామళ్లకోట. గత నెల 5, 6 తేదీలో టీడీపీ నేతలు, కార్యకర్తలు మా ఇంటి వద్దకు వచ్చి ఇష్టానుసారం మాట్లాడారు. మరుసటి రోజు నేను బస్టాండ్‌లో ఉంటే ఇద్దరు వచ్చి వాదనకు దిగడంతో గొడవ జరిగింది. దీంతో 60–70మంది ఏకంగా ఇంటిపైకి వచ్చారు. నన్ను దారుణంగా కొట్టారు. ఎస్‌ఐ చంద్రశేఖరరెడ్డి వచ్చి నువ్వు ఊళ్లో ఉంటే మళ్లీ గొడవ చేస్తారని చెప్పి బయటకు పంపించారు. రెండు రోజుల తర్వాత తిరిగి ఊరికొస్తే మళ్లీ అదే గొడవ. విధిలేక భార్య పిల్లలతో ఎక్కడెక్కడో తలదాచుకుంటున్నా.

రాఘవుడి సన్నిధిలో పాఠ్య బోధన



రాఘవుడి బృందావనం సన్నిధిలో పాఠ్య బోధనలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: చాతుర్మాస దీక్షలో కొనసాగుతున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు బుధవారం రాఘవేంద్రుల మూల బృందావనం సన్నిధిలో సర్వ మూల గ్రంథం శాంతి పాఠం బోధన చేశారు. గ్రంథ విచారణలో కర్ణాటకలోని బాలగర్ అక్షోభ్య పీఠం ఉప పీఠాధిపతి అక్షోభ్య రామప్రియ తీర్థులు, పండిత కేసరి రాజా ఎస్. గిరియాచార్, శ్రీమఠం పండితులు పాల్గొన్నారు.

పండ్లతోటల అభివృద్ధిలో అంతులేని నిర్లక్ష్యం

- రెండు నెలలు గడచినా 977 ఎకరాల్లోనే మొక్కలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి నిధులతో పండ్లతోటల అభివృద్ధిలో నిర్లక్ష్యం వేళ్లూనుకుంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఎస్సీ, ఎస్టీ రైతులు, సన్న, చిన్నకారు రైతులకు 100 శాతం సబ్సిడీతో పండ్లతోటలు అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. అయితే రైతుల్లో అవగాహన కల్పించే విషయంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. 2024–25 సంవత్సరానికి లక్ష్యం భారీగా ఉన్నా.. ఆచరణలో పురోగతి కరువైంది. జాతీయ గ్రామీణ ఉపాధి నిధులతో జాబ్ కార్డు కలిగి ఐదు ఎకరాల్లోపు భూములు కలిగిన రైతులందరూ పండ్లతోటలను అభివృద్ధి చేసుకునేందుకు అర్హులే. వర్షాకాలం మొదలై రెండు నెలలు గడచిపోయినా.. రైతులను గుర్తించడం, ఎస్టిమేట్లు జనరేట్ చేయడం, పరిపాలన అనుమతులు లభించిన రైతులతో గుంతలు తవ్వించి పండ్ల మొక్కలు నాటించడంలో ఉపాధి సిబ్బంది మీనమేషాలు లెక్కిస్తున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ప్రగతి సమీక్షలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో పురోగతి లోపించడం గమనార్హం.

- » ఈ ఏడాది 7,500 హెక్టార్లలో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యం.
- » ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్ 4,301 ఎకరాలకు పరిపాలన అనుమతులు ఇచ్చినప్పటికీ పిట్టింగ్ పనులు, మొక్కలు నాటించడంలో నిర్లక్ష్యం చోటు చేసుకుంది.
- » పరిపాలన అనుమతులు ఇచ్చిన రైతుల వివరాలను మొబైల్ యాప్‌లోకి అప్‌లోడ్ చేయాల్సి ఉంది.
- » ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.
- » ఈ నెల 3వ తేదీ వరకు 2,202 ఎకరాల్లో పిట్టింగ్ పనులు పూర్తి చేసినట్లు లెక్కలు ఉన్నాయి.
- » ఇందులో కేవలం 977 ఎకరాల్లో మాత్రమే పండ్ల మొక్కలు నాటినట్లు స్పష్టమవుతోంది.

తుంగభద్రలో తగ్గిన వరద ప్రవాహం

- టీబీ డ్యాం నుంచి కోట్ల బ్యారేజీలోకి 46,235 క్యుసెక్కులు
- బ్యారేజీ నుంచి 43,790క్యూసెక్కులు, కేసీకి 2445 క్యుసెక్కుల ఆవుట్ ఫ్లో
- ఇప్పటి వరకు 120 టీఎంసీలకుపైగా శ్రీశైలానికి వరద నీరు

కర్నూలు సిటీ: తుంగభద్రనదిలో వరదనీటి ప్రవాహం తగ్గింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో గత కొద్దిరోజులుగా ఉధృతంగా ప్రవహించిన ఈ నదికి మంగళవారం ఉదయం 97,287 క్యుసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, బుధవారం ఉదయానికి సగానికి తగ్గింది. ప్రస్తుతం కోట్ల విజయభాస్కర్ రెడ్డి(సుంకేసుల బ్యారేజీ)బ్యారేజీకి 46,235 క్యుసెక్కుల ప్రవాహం ఉంది. ఈ ప్రవాహంలో గేట్ల ద్వారా 43,790 క్యుసెక్కులు, కేసీ కాలువకు 2445 క్యుసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లాలో కానీ, తుంగభద్ర డ్యాం దిగువ నుంచి నది పరివాహక ప్రాంతాల్లో కానీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురువలేదు. అయితే, టీబీ డ్యాం ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో డ్యా గేట్లు పైకెత్తి పది రోజులకుపైగా నదిలోకి వరద నీరు విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు బ్యారేజీకి 120 టీఎంసీలకుపైగా నీరు చేరింది. ఆ నీటినంతా దిగువకు వదలడంతో శ్రీశైలం రిజర్వాయర్‌కు చేరుకుంటుంది. నదికి వరద నీరు రావడంతో నది తీర గ్రామాల రైతులు మోటర్ల ద్వారా నీటిని పంపింగ్ చేసుకుని పంటలను సాగు చేసుకుంటున్నారు. దీంతో పాటు గురురాఘవేంద్ర ప్రాజెక్టులోని రేమట, క్రిష్ణదొడ్డి, మునగాల ఎత్తిపోతల పథకాలతో పాటు మరి కొన్ని లిఫ్టుల ద్వారా నీటిని పంపింగ్ చేసుకొని పంటలను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు.

ఒకేరోజు సగటున 24.5 మి.మీ వర్షపాతం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యాప్తంగా ఒకేరోజు సగటున 24.5 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా దేవనకొండలో 55.8 మి.మీ, అత్యల్పంగా హొళగుందలో 4.2 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. మొదటి వారంలో 32.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సాధారణ సాగు 4.19 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 3,02,241 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి.

మండలం	వర్షపాతం(మి.మీ)
దేవనకొండ	55.8
కౌతాళం	52.4
వెల్దుర్తి	43.4
పత్తికొండ	42.2
కోసిగి	39.6
క్రిష్ణగిరి	36.2
నందవరం	32.8
ఆదోని	27.8
గోనెగండ్ల	26.2
తుగ్గలి	25.2

ముగ్గురు సీఐలకు స్థానచలనం

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ముగ్గురు సీఐలకు స్థానచలనం కలిగింది. నంద్యాల జిల్లా డోన్ రూరల్ సర్కిల్‌లో పనిచేస్తున్న అస్రార్ బాషాను ప్యాపిలి సర్కిల్‌కు, నంద్యాల ఫ్యాక్షన్ జోన్‌లో పనిచేస్తున్న వంశీధర్‌ను పాణ్యం సర్కిల్‌కు, ఆత్మకూరు యూపీఎస్‌లో పనిచేస్తున్న కె.లక్ష్మీనారాయణను ఆత్మకూరు రూరల్ సర్కిల్‌కు బదిలీ చేస్తూ నంద్యాల ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు శాఖలో వారం రోజులుగా విడతల వారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరుగుతున్నాయి.

ప్రతి శాఖకు వంద రోజుల ప్రణాళిక

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు (సెంట్రల్): ప్రతి శాఖ వంద రోజుల లక్ష్య సాధనపై ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజులు, ఏడాది, ఐదేళ్ల ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెలనెలా సమీక్ష చేస్తారన్నారు. అందువల్ల లక్ష్య సాధన కోసం ప్రతి శాఖ కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. నిధులు సమీకరణ, ప్రభుత్వ సహకారానికి తాను కృషి చేస్తానని చెప్పారు. ఇరిగేషన్‌కు సంబంధించి ప్రాజెక్టుల మరమ్మతులు, రిజర్వాయర్లు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, ఎస్‌ఎస్ ట్యాంకులు, ఆయకట్టుకు నీరివ్వడం తదితర అంశాలను ప్రణాళికలో చేర్చాలన్నారు. పరిశ్రమలకు సంబంధించి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి, సింగిల్ విండో అనుమతులు, పీపీపీ బెస్ట్ ప్రాజెక్ట్ ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై యాక్షన్‌ప్లాన్‌లు రూపొందించాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి ఇప్పటివరకు ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలు, ఆర్‌సీ లెవల్‌లో ఉన్న గృహాలపై, వ్యవసాయానికి సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్, సీఆర్‌సీ కార్డులు, పొలంబడి, రుణాల మంజూరు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. హార్టికల్చర్‌కు సంబంధించి పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో రైతులు పండించే ఉత్పత్తులను మార్కెటింగ్ ఏ విధంగా చేస్తే అన్నదాతలకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇలా ప్రతి శాఖ పూర్తిస్థాయిలో వంద రోజులు, ఏడాది, ఐదేళ్ల ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్వో, ఇన్‌చార్జ్ జేసీ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ మద్యం, సారా అరికట్టేందుకు చర్యలు



పత్తికొండలో రికార్డులు తనిఖీ చేస్తున్న సెబ్ అనంతపురం డీసీ విజయశేఖర్

తుగ్గలి(పత్తికొండ): అక్రమ మద్యం, నాటుసారాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)అనంతపురం డిప్యూటీ కమిషనర్ టి. విజయశేఖర్ తెలిపారు. పత్తికొండ సెబ్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. తనిఖీల్లో సీజ్ చేసిన వాహనాలు, ప్రాపర్టీ, పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. వాహనాల జప్తు ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమ మద్యం రవాణా, నాటుసారా స్థావరాలు, విక్రయాలు, సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సెబ్ ఇన్‌చార్జ్ ఎస్ఐ కార్తీక్‌సాగర్, హెడ్ కానిస్టేబుల్ వరదరాజులు పాల్గొన్నారు.

హెచ్‌డబ్ల్యూఓస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగమద్దయ్య



కార్యవర్గాన్ని అభినందిస్తున్న హెచ్‌డబ్ల్యూఓలు

కర్నూలు(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఆదోని కళాశాల వసతి గృహ సంక్షేమాధికారి ఎం. నాగమద్దయ్య ఎన్నియ్యారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఇందులో జిల్లా గౌరవాధ్యక్షులుగా బి. బెన్నమ్మ, ప్రధాన కార్యదర్శిగా కె. ఉస్మాన్, ఇప్పటి వరకు జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఉన్న జి సుంకన్నను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు కోశాధికారి ఎం. వెంకటరెడ్డి తెలిపారు. జిల్లాలోని వసతి గృహ సంక్షేమాధికారుల కోరిక మేరకు ఈ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ మెంబర్లు వలి, మదారి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి: భార్య, భర్తల మధ్య చోటుచేసుకున్న మనస్పర్థలతో భర్త పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలు.. ఎర్రమఠం గూడేనికి చెందిన కుడుముల లింగన్న(20) అదే గూడేనికి చెందిన లింగేశ్వరిని రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇంకా సంతానం కాలేదు. దీనికి తోడు భార్య ప్రవర్తన సరిగా లేదంటూ తరచూ గొడవ పడేవారు. మంగళవారం కూడా మరోసారి భార్య, భర్తలు గొడవ పడ్డారు. ఈక్రమంలో మనస్తాపానికి గురైన లింగన్న పురుగు మందు తాగిగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక రాత్రి మృతిచెందాడు. బుధవారం మృతుడి తండ్రి కుడుముల తిక్కన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


నేడే ఎస్‌ఎంసీల ఎన్నికలు

కర్నూలు (సిటీ): జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకులు ఓటర్లుగా ఉంటారు. జిల్లాలో మొత్తం 1,450 పాఠశాలలున్నాయి. వాటిలో గురువారం ఉదయం ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన సభ్యుల్లో నుంచి ఒకరిని చైర్మన్‌గా ఎంపిక చేసుకుంటారు. ఆ తర్వాత నూతన కమిటీలతో ప్రమాణ స్వీకారం నిర్వహిస్తారు. ఈ ఎన్నికలు నిర్వహణకు ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులు స్కూళ్లలో ఏర్పాట్లు చేశారు.

చిట్టి బుర్రలో సిత్రాలెన్నో!

- బాల శాస్త్రవేత్తలకు బంగారు అవకాశం
- ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల రూపకల్పనకు ఆహ్వానం
- 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు 5 ప్రాజెక్టులకు నమోదు
- అవార్డుకు ఎంపికైన జిల్లా స్థాయి విద్యార్థులకు రూ.10వేలు బహుమతి
- రాష్ట్ర, జాతీయి స్థాయి ప్రదర్శనలకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25వేలు బహుమతులు

విద్యార్థుల చిట్టి బుర్రల్లో ఎన్నో సృజనాత్మక అంశాలు దాగి ఉంటాయి. తాము ఉంటున్న పరిసరాలు, నేర్చుకున్న విషయాలు, చూసిన సమస్యలకు పరిష్కార మార్గాలను కనిపెడుతూ ఉంటారు. వివిధ విషయాలపై వారికున్న అవగాహన కొత్త ఆవిష్కరణలకు దారి చూపుతుంది. అయితే వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఒక వేదిక కావాలి. ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ వేడుక వారికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతోంది.





ఇన్‌స్పైర్ మనాక్ లోగో

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ సరికొత్త వేదికను రూపొందించారు. దీనిలో అన్ని ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ మేనేజ్ మెంట్ల పాఠశాలల విద్యార్థుల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు. దీని కోసం 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు తరగతికి ఒకటి చొప్పున ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులను నమోదు చేసుకునే అవకాశముంది.

ప్రాజెక్టులను పంపండిలా..

www.inspireawards&dst.gov.in వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా ఆగస్టు 30వ తేదీలోపు పాఠశాల విద్యార్థులు వారి ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు వీలుగా రూ.10వేల పారితోషకం అందిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25వేల వరకూ తమ ప్రాజెక్టును మెరుగుపర్చుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులు కేటాయిస్తుంది. ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన అవకాశాలతో పాటు ఇంజినీరింగ్ కళాశాల విద్యలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశం కూడా ఉంది. పూర్తి వివరాలకు ఆయా జిల్లాల సైన్స్ అధికారులను సంప్రదించవచ్చు.

ఇప్పటి వరకు జిల్లా నుంచి..

జిల్లాలో 156 ప్రాథమికోన్నత, 276 ప్రభుత్వ, 177 ప్రైవేట్ ప్రాథమికోన్నత, 190 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలున్నాయి. వీటి నుంచి గత విద్యా సంవత్సరంలో 173 ప్రాజెక్టులు నమోదయ్యాయి. అందులో 158 ప్రాజెక్టులు ప్రదర్శనలో పాల్గొన్నాయి. వాటిలో 16 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. వాటిని తయారు చేసిన విద్యార్థుల ఖాతాల్లో ఈ ఏడాది జనవరి నెలాఖరున రూ.10 వేల చొప్పున ప్రాజెక్టు రూపకల్పనకు నగదు జమ చేశారు.

అయితే జిల్లా నుంచి అత్యధిక ప్రాజెక్టులు నమోదవుతున్నప్పటికీ ఎంపిక సంఖ్య తక్కువగా ఉంటోందనే విమర్శలున్నాయి. ప్రాజెక్టులో సృజనాత్మకత, నాణ్యత లోపించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

దరఖాస్తు చేసుకునే విధానం..

తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను పరిష్కరించేలా ఐడియా ఉండాలి. తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, ఆలోచనకు అవసరమైన ప్రాజెక్టును రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి వివరాలు నమోదు చేయాలి. విద్యార్థికి సంబంధించిన బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ నంబరు ఎంటర్ చేయాలి. విద్యార్థి ప్రాజెక్టు సంక్షిప్తంగా, రాత పూర్వకంగా పొందుపర్చి, సంబంధిత రైటప్ వెబ్‌సైట్‌లో ఎంటర్ చేయాలి. ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టుల ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయి ఎంపికకు పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టుకు ప్రయోగ నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 30వ తేదీ వరకు గడువు ఉంది.

త్వరలో ఓరియంటేషన్ తరగతులు



ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టుల రూపకల్పనపై త్వరలోనే సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తాం. విద్యార్థులు వారి ప్రతిభను నిరూపించుకుని బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇది చక్కటి అవకాశం. విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలకు పదును పెడితే ఉత్తమ ప్రాజెక్టులు ఆవిష్కృతమవుతాయి.

– శామ్యూల్, ఆర్‌జేడీ, నంద్యాల

చక్కని అవకాశం



ప్రతిభను ప్రదర్శించేందుకు ఇన్‌స్పైర్ మనాక్ విద్యార్థులకు చక్కని అవకాశం. ఈ పోటీలో విద్యార్థులందరూ పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలి. జిల్లా నుంచి అత్యధికంగా నామినేషన్లు నమోదయ్యేలా చూడాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌లో గొప్ప శాస్త్రవేత్తలను కలుసుకునే అవకాశం లభిస్తుంది.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

సైన్స్ ఉపాధ్యాయుల పాత్ర కీలకం



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థుల చేత మంచి ప్రాజెక్టులు తయారు చేసేలా ప్రోత్సహించాలి. ఈ అద్భుతమైన అవకాశాన్ని అందిపుచ్చుకునేలా వారిని తీర్చిదిద్దాలి. ఇందులో సైన్స్ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం. రాష్ట్ర స్థాయిలో పోటీ పడేలా ప్రాజెక్టులకు రూపకల్పన చేయించాలి.

– కేవీ సుబ్బారెడ్డి, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్, నంద్యాల

పంట కోత ప్రయోగాలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 సంవత్సరానికి సంబంధించి పంట కోత ప్రయోగాలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఏవో, ఏడీఏ, స్టాటిస్టికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పాల్గొని విధి విధానాలు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటలకు బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్‌లో 393 గ్రామాలు, రబీలో 238 గ్రామాల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహించేందుకు ఎంపికయ్యాయన్నారు. ఖరీఫ్‌లో గ్రామం యూనిట్‌గా వరి, రబీలో శనగ ఎంపికయ్యాయని.. వరిలో 510, శనగలో 816 పంట కోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఖరీఫ్‌లో మండలం యూనిట్‌గా జొన్న, మొక్కజొన్న, ఎండుమిర్చి, ఆముదం, కంది పంటలు.. జిల్లా యూనిట్‌గా సజ్జ, కొర్ర పంటలను ఎంపిక చేసినట్లు వివరించారు. బీమా అమలుకు, పంట దిగుబడులను అంచనా వేసేందుకు పంట కోత ప్రయోగాలే ప్రమాణికం అవుతాయన్నారు. కార్యక్రమంలో సీపీవో హిమ ప్రభాకర్‌రావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి పి.రామాంజనేయులు, ఏపీఎంఐపీ అదనపు పీడీ రాజాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మాజీ మంత్రి బుగ్గన

- సంతోష్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కారు, బైక్ ఢీ
- గమనించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన బుగ్గన



సంఘటనా స్థలంలో ఉండి అంబులెన్స్‌కు ఫోన్ చేస్తున్న మాజీ మంత్రి బుగ్గన



ప్రమాదంలో గాయపడిన మహేష్, సావిత్రి

కర్నూలు: నగర శివారులోని సంతోష్ నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైన కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆయన డోన్‌కు వెళ్తుండగా సంతోష్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైన విశాల్ మార్ట్ సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో తెలంగాణ రాష్ట్రం ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన భార్యాభర్తలు మహేష్, సావిత్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆసుపత్రిలో చూపించుకునేందుకు మహేష్ దంపతులు కర్నూలుకు వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన బుగ్గన వెంటనే తన వాహనాన్ని ఆపి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. తర్వాత గాయపడిన భార్యాభర్తలిద్దరినీ వాహనంలో ఎక్కించి ఆసుపత్రికి పంపారు. కుటుంబ సభ్యుల్లా మాజీ మంత్రి స్పందించిన తీరుపై స్థానికులు ప్రశంసించారు. కాగా గాయాలకు గురైన వారు మెడికవర్ ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి ప్రమాద సంఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్లు ట్రాఫిక్ సీఐ గౌతమి తెలిపారు.

54 మంది ఎస్ఐల బదిలీ

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు(ఎస్ఐ)లను భారీ స్థాయిలో బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 54 మంది ఎస్ఐలకు బదిలీ ద్వారా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో 44 మంది కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న వారు కాగా, 8 మంది నాలుగో జోన్‌లోని వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న వారు. వీరికి కూడా కర్నూలు జిల్లాలోనే ఎస్ఐ పోస్టింగ్‌లు ఇచ్చారు. అలాగే డిప్యుటేషన్‌పై సీఐడీఓలో ఎస్ఐగా పనిచేస్తున్న ఎస్.రామాంజనేయులు, ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న ఎ.ధనుంజయలను వెనక్కి తీసుకొని వారికి వరుసగా కర్నూలు తాలూకా యూపీఎస్, ఉలిందకొండ పోలీసు స్టేషన్లకు ఎస్ఐలుగా కేటాయించారు. కాగా, బదిలీ అయిన ఎస్ఐలు వెంటనే విధుల్లో చేరి రిపోర్టు చేయాలని ఆయన ఆదేశించారు.

టమాటా లారీ బోల్తా



బోల్తా పడిన టమాటా లోడ్ లారీ

వెల్దుర్తి: మదనపల్లె నుంచి నాగపూర్‌కు వెళ్తున్న టమాటా లోడ్ లారీ హైవే 44పై వెల్దుర్తి హనుమాన్ జంక్షన్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. బుధవారం తెల్లవారుజాము 3గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. అయితే, డ్రైవర్ కమ్ ఓనర్ అదిలాబాద్‌కు చెందిన సాయిప్రసాద్, క్లీనర్ సురేశ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. లారీలోని 100 టమాటా బాక్సులు రోడ్డుపై పడి చెల్లా చెదరయ్యాయి. హైవే పోలీసులు, సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని లారీని పక్కకు తప్పించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. వర్షానికి హనుమాన్ జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు కనిపించకపోవడం ..తర్వాత సడన్‌బ్రేక్ వేయడంతో లారీ అదుపుతప్పి పడిపోయినట్లు డ్రైవర్ తెలిపాడు.

రుణాలు ఇప్పిస్తానంటూ టోకరా

ఆలూరు రూరల్: ప్రైవేటు బ్యాంకులో రుణాలు ఇప్పిస్తానని నమ్మించి ఓ మహిళ లక్షలరూపాయలు కాజేసింది. బాధితులు బుధవారం పోలీసులకు ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పట్టణానికి చెందిన ఓ మహిళ స్మాట్ లోన్ యాప్ ద్వారా రుణాలు ఇప్పిస్తానని గుంతకల్లు, ఆలూరు, హొళగుంద మండలాలకు చెందిన వ్యక్తులను మభ్య పెట్టి రూ.30 లక్షలు పైగా వసూలు చేసింది. మొదట్లో రూ.10వేల నుంచి 20 వేల వరకు ఇప్పించి నమ్మకం పెరిగేలా చేసింది. తర్వాత మరింత ఎక్కువ లోన్ ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ.1 నుంచి 2 లక్షల వరకు నగదు తీసుకున్నట్లు తెలిసింది. రుణం ఇప్పించకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు బుధవారం ఆలూరు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ విషయమై ఆలూరు ఎస్ఐ ఓబులేషుకు వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త హత్య కేసులో నిందితుల అరెస్ట్

బొమ్మలసత్రం: మహానంది మండలం సీతారామపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పసుపులేటి సుబ్బరాయుడు (68) హత్య కేసులో 11 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రూరల్ ఇన్‌చార్జ్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాలు.. ఈనెల 3న అర్థరాత్రి సీతారామపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలిసి కత్తులు, కర్రలు, రాళ్లతో వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడులకు తెగబడ్డాడు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన సుబ్బరాయుడు ఇంటి వద్దకు వెళ్లి ఇంట్లో నిద్రిస్తున్న అతన్ని బయటికి లాక్కొచ్చి నడిరోడ్డుపై కర్రలతో చితకబాది, కత్తులతో నరికి, బండరాయితో అతి క్రూరంగా హత్య చేశారు. అడ్డుకోబోయిన సుబ్బరాయడి భార్య సుబ్బమ్మపై కూడా దాడి చేసి గాయపరిచారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తునకు ఆదేశించారు. ఈక్రమంలో బుధవారం చాబోలు గ్రామ శివారులో ఉన్న ఏ–2 నిందితుడు బుడ్డారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏ–3 వంగాల లక్ష్మిరెడ్డి, ఏ–4 వంగాల పుల్లారెడ్డి, ఏ–5 బుడ్డారెడ్డి గారి లక్ష్మి నాగశేఖర్‌రెడ్డి అలియాస్ కుంటి శేఖర్‌రెడ్డి, ఏ–7 తాలూరి శ్రీనివాసులు అలియాస్ దుబ్బ శ్రీను, ఏ–9 పెరుమాళ్ల వెంకట రమణ అలియాస్ డీలర్ రమణ, ఏ–10 మైలాపురం రామచంద్రారెడ్డి, దూదేకుల బాలహుస్సేని, జిలెల్ల భాస్కర్, ఏ–11 గని రంగస్వామి, ఏ–12 వంగాల ఈశ్వర్‌రెడ్డిలను అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. హత్యకు ఉపయోగించిన రెండు కార్లు, మూడు కత్తులు, మూడు కట్టెలు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు విచారణలో ఎస్ఐలు మల్లికార్జున, నాగార్జునరెడ్డి చాకచక్యంగా వ్యవహరించినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన కురువ శివుడు



హత్య స్థలంలో డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న పోలీసులు

కర్నూలు: మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన కురువ శివుడు (36) బుధవారం దారుణ హత్యకు గురయ్యాడు. ఇతను భార్యను వదిలేసి కుటుంబ సభ్యులకు దూరంగా కర్నూలు పాతబస్తీలోని గడియారం ఆసుపత్రి సమీపంలోని వర్మ కాంపౌండ్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. దీంతో పాటు పాతబస్తీలో పెయింటర్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న రఫిక్ ఇంట్లో ఉంటూ వారి కుటుంబ సభ్యులకు జిమ్ నేర్పించేవాడు. ఈ క్రమంలో రఫిక్ భార్యతో పాటు కూతురితో శివుడు సన్నిహితంగా ఉండేవాడు. శివుడిపై కక్ష పెంచుకున్న రఫిక్ కొంత మంది బంధువులతో కలిసి మంగళవారం అలంపూరు టోల్ గేట్ దగ్గరికి వెళ్లి మద్యం సేవించి తిరిగి కర్నూలుకు వచ్చారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం వర్మ కాంపౌండ్‌లో ఉన్న కొట్టం దగ్గరకు శివుడిని తీసుకెళ్లి క్రికెట్ బ్యాట్‌లతో తలపై బాది పరారయ్యారు. బుధవారం ఉదయం స్థానికులు కనుగొని పోలీసులకు సమాచారమిచ్చారు. ఒకటో పట్టణ సీఐ పవన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం చేయండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు (సెంట్రల్): సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని, నివారణకు అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ పోలీసు సిబ్బందిని సూచించారు. బుధవారం ఆయన మాధవ్ మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసులతో సమావేశమై విధులకు సంబంధించిన పలు సూచనలు చేశారు. సిబ్బంది యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల రికార్డులను నిశితంగా పరిశీలించారు. వారి ఫొటోలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. పదేపదే జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమానాస్పద మిస్సింగ్ కేసులను త్వరగా ఛేదించాలన్నారు. ఆయన వెంట మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ మన్మథ విజయ్ ఉన్నారు.

బెస్ట్ స్కూల్‌గా అబ్దుల్ కలాం మెమోరియల్

- రాష్ట్ర స్థాయిలో వరుసగా మూడోసారి ఎంపిక

కర్నూలు సిటీ: ముచ్చటగా మూడోసారి రాష్ట్ర స్థాయిలో నగరంలోని డా.ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మునిసిపల్ హైస్కూల్ బెస్ట్ స్కూల్‌గా ఎంపికైంది. ఏటా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లను ఉత్తమ అవార్డులకు ఎంపిక చేస్తారు. కర్నూలు జిల్లా నుంచి నగరంలోని ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ ఎంపికైంది. ఈ స్కూల్‌నుంచి 2023–24 విద్యా సంవత్సరంలో 48 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే అందరూ 500కు పైగా మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. షేక్ హుమేరా ఇక్బాల్ అనే విద్యార్థి ఏకంగా 593 మార్కులు సాధించింది. ఈ నెల 15వ తేది జరిగే స్వాంత్రత్య వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ స్కూల్ అవార్డు అందుకోనున్నట్లు ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త గడ్డివామికి నిప్పు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వెల్దుర్తి: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త, రైతు తలారి బోయ రామచంద్రుడుకు చెందిన కల్లంలోని గడ్డివామి బుధవారం దగ్ధమైంది. గడ్డివామి నుంచి మంటలు చెలరేగడం గుర్తించిన స్థానికులు, పికెట్ పోలీసుల సమాచారం మేరకు డోన్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. కాగా.. అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. దీంతో బోయరామ చంద్రుడికి రూ.50వేల నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

మాధవీనగర్‌లో చైన్‌స్నాచింగ్

కర్నూలు: నగరంలోని మాధవీనగర్‌లో గొలుసు దొంగ హల్‌చల్ సృష్టించాడు. శకుంతల కల్యాణ మండపం వద్ద కర్రీ పాయింట్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న బిందుమాధవి బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో మాధవీ నగర్‌లోని ఇంటికి వెళ్తుండగా రవీంద్ర స్కూల్ వద్ద గుర్తు తెలియని యువకుడు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని గొలుసును లాక్కెళ్లాడు. ఆమె దొంగ అని కేకలు వేసేలోగా వాహనం వేగం పెంచి పక్క సందులో నుంచి కనిపించకుండా పరారయ్యాడు. నాలుగు తులాల గొలుసు చోరీకి గురైనట్లు బాధితురాలు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని సంతోష్ నగర్‌లో అపార్టుమెంట్ పార్కింగ్ స్థలంలో అనుమతి లేకుండా నిర్మించిన గదులను టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. ఫిర్యాదులు రావడంతో సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులతో పాటు చైన్‌మెన్లు ఆ ప్రాంతానికి వెళ్లి అక్రమ కట్టడాలను కూల్చి వేసే విధంగా చర్యలు తీసుకున్నారు. అలాగే నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో నగరపాలక సంస్థ స్థలంలో ఏర్పాటు చేసిన షాపులు, ఆక్రమణలను తొలగించారు.